# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 86 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 18, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## ఇబ్రహీం భాగ్ విద్యుత్ ఈఆర్ఓ జే ఏ ఓ గా ఎం భాస్కర్ రెడ్డి



**గండిపేట, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** ఇబ్రహీం బాగ్ విద్యుత్ ఈ ఆర్ ఓ జే ఏ ఓ గా ఎం భాస్కర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. . గురువారం నార్సింగి లోని విద్యుత్ డి ఈ కార్యాలయం ఆవరణలో గల ఈ ఆర్ ఓలో భాస్కర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. పదవి బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ రెడ్డిని విద్యుత్ ఉద్యోగ 1104 సంఘం ప్రతినిధులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా
## సంజీవ్ ఖన్నా



- కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్

**న్యూఢిల్లీ,అక్టోబర్17(నమస్తే ఉదయం):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన మిగతా.. 2లో

## రైల్వే రిజర్వేషన్‌లో మార్పులు



- 120 రోజుల నుంచి 60 రోజులకు కుదింపు
- నవంబర్ ఒకటో తేది నుంచి అమలు

**న్యూఢిల్లీ,అక్టోబర్17(నమస్తే ఉదయం):** టికెట్ రిజర్వేషన్లకు సంబంధించి భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రయాణానికి 120 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండగా.. దానిని 60 రోజులకు కుదించింది. ఇందుకోసం మిగతా.. 2లో



మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### ఘనంగా వాల్మీకి మహర్షి
## జయంతి వేడుకలు

**కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్17(నమస్తే ఉదయం):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నర్సింగరావు, జిల్లా బి.సి సంక్షేమ అధికారి రమేష్ బాబు, వాల్మీకి సంఘం నాయకులు గట్టు తిమ్మప్ప, ఆంజనేయులు, కౌన్సిలర్ మురళి, రాజు, మధుసూదన్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మూసీ సుందరీకరణ కాదు..
# మూసీ నది పునరుజ్జీవం

- మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం
- మూడు నెలలు కెటిఆర్, హరీష్, ఈటెల అక్కడ ఉంటారా
- వారికి సకల సౌకర్యాలు కల్పించి ఉంచుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా
- మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సీఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్17(నమస్తే ఉదయం):** తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేమలఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళు ఎప్పుడూ ఉంటారని అన్నారు. మిగతా.. 2లో



### జీవో నెంబర్ 29ని
# రద్దు చేయాలి

- మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల పక్రియ
- పాత జీవో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన
- పిసిసి చీఫ్, కెటిఆర్‌లతో విడివిడిగా అభ్యర్థుల భేటీ


**హైదరాబాద్,అక్టోబర్17(నమస్తే ఉదయం):** తెలంగాణలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగా మారింది. గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్టులలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని మిగతా.. 2లో

### పౌరసత్వ చట్టం సెక్షన్ ఏ
## రాజ్యాంగబద్ధమే

- సమర్థించిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ, (నమస్తే ఉదయం):** పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్‌ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగ బద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో మిగతా.. 2లో



### పొరపాట్లు లేకుండా
## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**హైదరాబాద్,అక్టోబర్17 (నమస్తే ఉదయం):** ఈనెల 21 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు జరిగే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో నేడు సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

తెలంగాణా పబ్లిక్ సర్వీస్ కమీషన్ కార్యాలయం నుండి కమీషన్ చైర్మన్ డా. మహేందర్ రెడ్డి, సభ్యులు పాల్గొనగా, సచివాలయం నుండి డీజీపీ జితేందర్, కమీషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్‌పిడిసిఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు మిగతా.. 2లో

### ఖజానాకు
## లిక్కర్ కిక్కు

- మళ్లీ మద్యం ధరలకు రెక్కలు?
- మందు బాదుడుకు సర్కారు సిద్ధం
- బ్రూవరీల కోరిక మన్నించనున్న రేవంత్ సర్కారు
- దసరా అమ్మకాలతో ఖజానాకు కిక్కే కిక్కు



**హైదరాబాద్,(నమస్తే ఉదయం):** తెలంగాణ సర్కారు మందుబాదుడుకు సిద్ధమవుతోంది. ఖజానా కిక్కు కోసం మందుబాబులపై భారం వేసేందుకు రెడీ అవుతోంది. బ్రూవరీల కోరికను మన్నించడం ద్వారా, మందుధరలు పెంచి ఖజానాను పరిపుష్ఠం చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు మిగతా.. 2లో



### అట్టహాసంగా నాయబ్
## సింగ్ సైనీ ప్రమాణం

- హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు

**చండీగఢ్,అక్టోబర్17(నమస్తే ఉదయం):** హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మిగతా.. 2లో

# మరో రైలు ప్రమాదం

- అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్
- ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశాలు



**గౌహతి,అక్టోబర్17(నమస్తే ఉదయం):** వరుస రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అస్సాంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అస్సాంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్‌తో పాటు ఎనిమిది కోచ్‌లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు.

ఈ ప్రమాదం గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగింది. అగర్తల, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న రైలు డిబాలాంగ్ స్టేషన్ గుండా వెళుతుండగా పట్టాలు తప్పింది. అయితే పట్టాలు తప్పిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తరువాత అసోం సీఎం హిమంత విశ్వ శర్మ కూడా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రయాణికులకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో తాను రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు మిగతా.. 2లో

# పొరపాట్లు లేకుండా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, దీనికోసం 46 పరీక్షా కేంద్రాలను హైదరా బాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ పరీక్షలు నిర్వహించే అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు, విస్తృత స్థాయిలో సీనియర్ అధికారులతో పర్యవేక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్లు నేరుగా ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తా రని, సంబంధిత పోలీస్ కమీషనర్లు కూడా తగు బందోబస్తు ఏర్పాట్లను చేపడుతారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఏవిధమైన స్వల్ప సంఘటనలు జరుగ కుండా అత్యంత అప్రమత్తంగా ఈ పరీక్షల నిర్వహణా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. టిజిపిఎస్సీ చైర్మన్ డా.ఎం.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, 2011 సంవత్సరం అనంతరం గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయని, కొన్ని సంవత్సరాల అనంతరం జరిగే ఈ పరీక్షల నిర్వహణలో ప్రతీ అంశంలోనూ అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా ఆక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని, ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేం దర్ రెడ్డి అన్నారు. గ్రూప్ -1 జరిగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విస్తృతమైన బందోబస్తుతోపాటు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని చర్యలు చేపట్టామని డీజీపీ జితేందర్ తెలిపారు.

టిజిపిఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మాట్లాడుతూ, హైద రాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజి గిరి జిల్లాలో 27 మొత్తం 46 కేంద్రాలలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నిం టిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసి, టిజిపిఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

పరీక్షల నిర్వహణలో ప్రతిస్టెప్‌లోనూ కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శ కాలు అందచేశా మని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు, మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే, 85 శాతం అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకున్నారని తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యే కంగా ఒక గంటను అదనంగా కేటాయిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైతే పరీక్ష రాయడానికి సహాయకులు (స్క్రైబ్ ) అవ సరమో, ఆ అభ్యర్థుల హాల్ టికెట్లపై ప్రత్యేకంగా పేర్కొనడం జరిగిందని, స్క్రైబ్‌ల సహాయంతో పరీక్షలు వ్రాసేవారికి ప్రత్యే కంగా 4 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి వెల్లడించారు.

అన్నిపరీక్షా కేంద్రాల 46 వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా చర్యలు చేపట్టినట్లు, ఇందుకుగాను ముగ్గురు సి.ఈలు పర్యవేక్షిస్తారని ఎస్పిడిసిఎల్ ఎండీ ముషారఫ్ అలీ అన్నారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రూప్ -1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్‌లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని కెటిఆర్ కు కూడా అభ్యర్థులు వివరించారు. దీనిపై కెటిఆర్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై న్యాయ సలహా తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అభ్యర్థులకు అన్నివిధాల అండగా ఉంటామని కెటిఆర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రూప్ 1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అయితే, ఈ వివాదం కొనసాగుతుండగానే ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న టీజీపీఎస్సీ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.

## మూసీ సుందరీకరణ కాదు..
# మూసీ నది పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు.

'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



సిఇ పి & ఎంఎంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ సన్మానిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

## టీజీఎస్పీడీసీఎల్ సిజిఎం (పి & ఎం ఎం)గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

**హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిజిఎం (పి & ఎం ఎం) పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ. డి శ్రీరామ్మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం హైదరాబాదులోని మింట్ కాంపౌండ్‌లో గల సిజిఎం ఆనంద్ కార్యాలయంలో ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సిజిఎం ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ చంద్రశేఖర్, లత పాటు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 50 వేల విరాళాన్ని అందించిన జిల్లా గణేష్...

**కూకట్‌పల్లి,అక్టోబర్ 17 (నమస్తే ఉదయం):** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి స్థల సేకరణలో భాగంగా రూ.50 వేల విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కోసం 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఇంకా ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్టు జిల్లా గణేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర
# అందరికి ఆదర్శం

### - జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

**గద్వాల, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** దివ్య జ్ఞానంతో రామాయణ మహాకావ్యాన్ని గొప్పగా రచించి ప్రపంచానికి అందించిన వాల్మికి మహర్షి జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు అన్నారు.





గురువార ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి వేటగాని వృత్తి తో జీవితం గడిపి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకిగా మారి అద్భుతమైన రామాయణం గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకీ గారని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని, ఏ వయసులో అయిన పట్టు దళ తో పని చేస్తే విజయం సాధించవచ్చు అని నిరూపించారని కొనియాడారు.ఈ కార్యాలయంలో సాయుధ దళ డి.ఎస్పి నరేందర్ రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి సతీశ్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ రాజు,ఆర్ ఐ లు వెంకటేష్, హరీఫ్,సూపరింటెండెంట్ లు, అయా విభాగాల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# ఖజానాకు లిక్కర్ కిక్కు

మొదటి పేజీ తరువాయి..

సమాచారం. ప్రభుత్వం కూడా అందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ధరలు 15 శాతం వరకు పెరిగే అవకాశం కనిపిస్తోంది.ఆర్థిక కష్టాల్లో ఉన్న సర్కారును మందు బాబులు ప్రతిసారీ ఆదుకుంటున్నారు. ఇప్పుడు అప్పులతోతమతమవుతున్న రేవంత్‌రెడ్డి సర్కారును మరోసారి మందుబాబులు ఆదుకోను న్నారు. అంటే మళ్లీ మద్యం ధరలకు రెక్కలు రానున్నాయన్న మాట. మద్యం ధరలు పెంచాలని బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ప్రభుత్వం ధరలను ప్రతి రెండేళ్లకోసారి పెంచు తుంది. వివిధ రకాల మద్యంపై రూ.20 నుంచి రూ.150 వరకు పెంచాలని బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరాయి. తెలంగాణలోని6 బ్రూవరీల్లో ప్రతి సంవత్సరం 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతోంది. దసరా పండుగ సమయంలో మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి. ఈసారి పది రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకు పైగా మద్యాన్ని తెలంగాణ మందుబాబులు తాగేశారు. మద్యం అమ్మకాల్లో ఈసారి కూడా హైదరాబాద్ ముందు నిలిచింది. సెప్టెంబర్ 30 వరకు రూ.2,838 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ రూ.1,100 కోట్ల విలువైన 10 లక్షల 44 వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగాయని ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజుల వ్యవధిలో 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయినట్లుగా తెలుస్తోంది. ఇదే కిక్కుతో మద్యంపై బాదుడు ద్వారా మరిన్ని వేల కోట్ల రూపాయల ఆదాయానికి రేవంత్ సర్కారు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది.

# పౌరసత్వ చట్టం సెక్షన్ ఏ రాజ్యాంగబద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

పిటిషన్లు దాఖలయ్యాయి.

పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కార మని.. సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేం దుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు. మానవీయ ఆందోళనలను పరిష్కరిం చడంతో పాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయిం చిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

# అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. సీఎంతోపాటు అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ ధండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శ్యామ్ సింగ్ రాణా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది.

సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగియడంతో పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరిగింది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి తదితర కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించ వచ్చని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 48, కాంగ్రెస్ 37 సీట్లలో గెలుపొందాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేసింది. 90 స్థానాల్లో 67.9 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపొందిన సీనియర్ నేతల్లో నయాబ్ సింగ్ సైనీతో పాటు, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, ఃఏఖ నేత అనిల్ విజ్ (అంబలా కాంట్), శ్రుతి చౌదరి (తోషమ్), ఎఔఒఆ అర్జున్ చౌతాలా తదితరులు ఉన్నారు.

## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా
# సంజీవ్ ఖన్నా

(మొదటి పేజీ తరువాయి)

తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయ మూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితుల య్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు.

ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు 9 న జస్టిస్ యుయూ లలిత్ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో రెండేళ్ల పాటు సీజేగా ఉన్నది చంద్రచూడ్ మాత్రమే. అంతేకాదు, జస్టిస్ చంద్రచూడ్ తండ్రి జస్టిస్ విశ్వనాథ్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు 16 ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అత్యధికాలం సీజేఐగా పనిచేసింది కూడా ఆయనే. ఏకంగా 7 సంవత్సరాల 139 రోజుల పాటు పదవీలో కొనసాగారు.

# రైల్వే రిజర్వేషన్‌లో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ఐఆర్‌సీటీసీ నిబంధనల్లో మార్పులు చేసింది. నవంబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అయితే, ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి మాత్రం ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. కొత్త నిబంధన నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నప్ప టికీ.. అక్టోబర్ 31 వరకు బుకింగ్ చేసుకునే వారికి పాత నిబంధన వర్తిస్తుంది. తాజ్ ఎక్స్‌ప్రెస్ , గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో ఎటువంటి మార్పూ లేదు. ఇప్పటికే వాటిలో బుకింగ్ వ్యవధి తక్కువగా ఉంది. ఇక విదేశీ పర్యటకులు మాత్రం 365 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా ఇందులోనూ ఎలాంటి మార్పూ లేదు. ఇదిలా ఉంటే, గతంలోనూ రైల్వే ముందస్తు బుకింగ్ ప్రయాణానికి 60 రోజుల ముందే ఉండేది. దానిని 120 రోజులకు పెంచిన భారతీయ రైల్వే.. తాజాగా మళ్లీ మునుపటి వ్యవధికే మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు విలువ 2 శాతం మేర క్షీణించి రూ.873 వద్ద ట్రేడవుతోంది. గడువు కుదింపు వల్ల ఆ మేర క్యాన్సిలేషన్లు తగ్గి ఐఆర్‌సీటీసీకి ఆదాయం తగ్గే అవకాశం ఉండడమే దీనికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

# మరో రైలు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ప్రమాదానికి ముందు అగర్తల-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం బయలుదేరింది. ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతో లుమ్డింగ్ బదర్‌పూర్ సింగిల్ లైన్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు సహాయం, అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 03674 263120, 03674 263126లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. అయితే రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.


రాములు గౌడ్ (ఫైల్ ఫోటో)


లంగర్ హౌస్ లోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద రాములు గౌడ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామీ గౌడ్, సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, బాలు, శ్రీకాంత్ తదితరులు


రాములు గౌడ్ ప్రయాణించిన ద్విచక్ర వాహనం

## నార్సింగి సమీపంలో రోడ్డు ప్రమాదం.. సీనియర్ జర్నలిస్ట్,

# ప్రజాటైమ్స్ ఎడిటర్ రాములుగౌడ్ దుర్మరణం

### సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, మాజీ మండలి చైర్మన్ స్వామిగౌడ్.

**రాజేంద్రనగర్ అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ జర్నలిస్ట్ నిండు ప్రాణాలు బలి తీసుకుంది. ద్విచక్ర వాహనం వార్తల సేకరణలో భాగంగా వెళ్లి తిరిగి వస్తు క్రమంలో టిప్పర్ రూపంలో మృత్యువు ఆ సీనియర్ రిపోర్టర్, ప్రజా టైమ్స్ ఎడిటర్ ప్రాణాలను కభళించింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జర్నలిస్టతో పాటు అన్ని పార్టీల నాయకులు, ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన ఈసంఘటన నార్సింగి- తారామతి బారాదరి ప్రధాన రహదారిలోని నెక్నాంరీర్ పెట్రోల్ పంపు సమీపంలో గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

హైదర్‌రీడ ఎర్రబోడలో నివాసం ఉండే రాములుగౌడ్ సీనియర్ జర్నలిస్ట్. వివిధ పత్రికల్లో పని చేసిన ఆయన సొంతంగా ప్రజాటైమ్ పత్రికను స్థాపించి ఎటిటర్ గా వ్యహరిస్తున్నారు. రాములుగౌడ్ స్వగ్రాయం కొండగల్ కోస్గి కాగా, చాలా ఏళ్ల క్రితం నగరానికి వచ్చి భార్య గీత, ఒక కుమారుడు కుమార్తెతో కలసి హైదరూడ సమీపంలోని ఎర్రబోడంలో నివాసం ఉంటున్నారు. కాగా, గురువారం వార్తల సేకరణలో భాగంగా నెక్నాపూర్ వైపు వెళ్లిన రాములుగౌడ్ తిరిగి తన ద్విచక్రవాహనంపై ఎర్రబోడకు భయలు దేరాడు. నార్సింగి తారామతి బారాదరి ప్రధాన రహదారిలోని నెక్నామూర్ కూడలి వద్ద ఉన్న పెట్రోల్ పంపులో తన వాహనంలో పెట్రోల్ పోసుకోవడానికి ఆగాడు. వాహనంలో పెట్రోల్ పోసుకుని బైక్ స్టార్ట్ చేసుకుని ముందుకు కదిలిన రాములుగౌడ్ వాహనాన్ని వెనుకాల నుంచి వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ ఢీకొట్టింది.

దాంతో రాములుగౌడ్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. అదే సమయంలో అటుగా వెళు తున్న స్థానికులు, ఎర్రబోడ వాసులు ప్రమాదంలో గాయపడింది జర్నలిస్ట్ రాములు గౌడ్ అని గుర్తించి వెంటనే లంగర్హౌస్ బాపూఘాట్ వద్ద ఉన్న రినోవా ఆసుప్రతికి తలించారు. అపస్మారక స్థితిలో ఉన్న రాములుగౌడ్ ని పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడు రాములుగౌడ్ కు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం.

**రాములుగౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం**

ప్రజా టైమ్స్ ఎడిటర్, సీనియర్ రిపోర్టర్ రాములు గౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నామని సీనియర్ జర్నలిస్ట్ మ్యాధం మధు ఆవేధన వ్యక్తం చేశారు. ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన పలువురు జర్నలిస్టు కలసి రినోవా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే రాములు ఇకలేడు అన్న వార్త తీవ్రంగా కలసి వేసిందని ఆయన అన్నారు. టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా నాయకుడు అప్పారెడ్డిగూడెం భీమయ్య, రాజేంద్రనగర్ సర్కిల్ యూనియర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి, పి సూర్యనారాయణ, కోశాధికారి విజయ్, సహాయ కార్యదర్శి టి. లక్ష్మణ్, సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బాలు, ప్రతినిధులు శ్రీకాంత్, నర్సింహా తదితరులు రాములుగౌడ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు రాములుగౌడ్ కుటుంబానికి సాటి జర్నలిస్టుగా అండగా ఉంటామన్నారు.


రాములు గౌడ్ మృతికి కారణమైన టిప్పర్

# విద్యుత్ డిఈ శివ శంకర్‌ను సన్మానించిన అధికారులు, ఉద్యోగులు

**మెహదీపట్నం, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్) గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం శివశంకర్ ను రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఉద్యోగ1104 సంఘం ప్రతినిధులు సన్మానించారు. గురువారం మెహదీపట్నంలోని నానల్ చౌరస్తా లోగల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ కార్యాలయంలో రాజేంద్రనగర్ డివిజన్ 1104 యూనియన్ అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అజీమ్ ల ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఎం శివ శంకర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డి.ఈ.శివశంకర్‌ను సన్మానించిన వారిలో యూనియన్ ప్రతినిధులు బాబురావు, లైన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, లైన్ మాన్ ప్రసాద్, ఉద్యోగులు పద్మనాభం, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ డి.ఈ.గా పనిచేసి బదిలీ అయిన ఎం శివశంకర్ ను డివిజన్ పరిధిలోని శంకర్పల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రదీప్ కుమార్, కాంట్రాక్టర్ సుమన్, ఉద్యోగులు యుగంధర్, కృష్ణారెడ్డిలు సన్మానించారు.


రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్)గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం శివశంకర్‌ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ ఉద్యోగ 1104 సంఘం ప్రతినిధులు


ఇబ్రహీం బాగ్ పూర్వపు విద్యుత్ గా పనిచేసి బదిలీ అయిన ఎం శివశంకర్ ను సన్మానిస్తున్న శంకర్ పల్లి ఏఈ ప్రదీప్ కుమార్, కాంట్రాక్టర్ సుమన్


రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్), ఆత్మీయ అధికారి ఎం శివ శంకర్ ను ఉద్యోగ 1104 యూనియన్ నేత ఎం భాస్కర్ రెడ్డి


నార్సింగి లోని ఇబ్రహీం భాగ్ డి ఈగా పదవి బాధ్యతలు స్వీకరించిన రమేష్ చంద్రను సన్మానిస్తున్న డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది

# రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి.ఈ. (టెక్నికల్)గా ఎం.శివ శంకర్

### ఆత్మీయ అధికారి ఏం శివశంకర్‌కు ఘనంగా సన్మానం

### ఎం శివశంకర్‌ను సన్మానించిన ఇబ్రహీం బాగ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది

### ఇబ్రహీం బాగ్ నూతన విద్యుత్ డి ఈ రమేష్ చంద్ర కు ఘనంగా సన్మానం చేసిన ఉద్యోగ సంఘం

**మెహదీపట్నం/నార్సింగి, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** ఇబ్రహీం బాగ్ విద్యుత్ డివిజన్ పూర్వపు డి ఈ ఎం శివశంకర్, నూతన డి ఈ ఎం రమేష్ చంద్ర లను ఇబ్రహీం బాగ్ డివిజన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మా నించారు. మెహదీపట్నం నానల్ నగర్ చౌరస్తాలోని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ డి ఈ (టెక్నికల్), ఆత్మీయ అధికారి గా పేరొందిన ఎం శివశంకర్ ను పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల1104 సంఘం కంపెనీ అడిషనల్ సెక్రెటరీ, విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ రీజినల్ సెక్రటరీ ఎం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు, డివిజన్ ఉద్యోగులు సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఈ ఎం శివ శంకర్ మాట్లాడుతూ... ఇబ్రహీం బాగ్ డీఈగా పనిచేసిన మూడేళ్ల కాలంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిల సమన్వయంతో వినియోగదారులకు సేవలు అందించడంతోపాటు సంస్థ ఆదాయానికి కలిసి పనిచేశామన్నారు. ఒక అధికారి గానే కాకుండా కుటుంబ సభ్యుడిగా డివిజన్లో పనిచేస్తున్న అధికారి, ఉద్యోగి, సిబ్బందికి ఏ సమస్య వచ్చిన కుటుంబ సభ్యుడిగా తన వంతుగా బాధ్యతాయుతంగా పనిచేశానన్నారు. తాను బదిలీ అయిన సందర్భంగా మీరు చూపిన ప్రేమ మరువలేనిదని ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులతో పాలుపంచుకున్నారు. అదేవిధంగా ఇబ్రహీం భాగ్ నూతన డి ఈ ఎం రమేష్ చంద్ర ను ఉద్యోగ సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది లు శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఈ రమేష్ చంద్ర మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆశయంతో ముందుకు వెళుతుందని అందరం సమన్వయంతో కలిసి ప్రభుత్వ ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ అభ్యున్నతి కోసం అందరం కలిసి పనిచేయడంతో పాటు విద్యుత్ వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ముందుకు సాగుదాం అన్నారు.


డి ఈ రమేష్ చంద్ర సన్మానిస్తున్న డివిజన్, ఈ ఆర్ వో ఉద్యోగులు, సిబ్బంది



# మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా రామన్ గౌడ్

**గద్వాల(కేటిదొడ్డి), అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** పంచాయతీ కార్యదర్శుల సంఘం కేటిదొడ్డి మండల అధ్యక్షులుగా గంగన్ పల్లి పంచాయతీ కార్యదర్శి రామన్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఖాజామీర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా రామన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా లింగన్న, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# పార్చర్లలో సందె రాళ్ల పోటీలు

**గద్వాల, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని గురువారం ధరూర్ మండలం పార్చర్ల గ్రామంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు వాల్మికి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సందె రాళ్ల పోటీలలో మొదటి బహుమతి ప్రతాప్, రెండో బహుమతి సూరి, మూడవ బహుమతి అంపయ్యలు




విజేతలుగా నిలువగా... వారికి రూ.16,000, రూ.7,000, రూ.6,000 నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మికి సంఘం నాయకులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

### ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర్ రెడ్డి

### వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** రామాయణ రచయిత వాల్మీకి మహర్షిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ధరూర్ మండలం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో అయా గ్రామాలలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి





మహర్షి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతీయ సాహిత్యానికి ఆధ్యుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామాయణాన్ని అందించిన వాల్మీకి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాకావ్య సృష్టికర్త వాల్మీకి

### - మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంత్

### ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**గద్వాల(కేటిదొడ్డి), అక్టోబర్ 17(నమస్తే ఉదయం):** శ్రీమద్రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షీ వాల్మీకి అని, ఒక సామాన్య వ్యక్తిగా పుట్టిన బోయవాడు.. అడవిలో పెరిగి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షీగా మారాడని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హను మంతు, వాల్మీకి సంఘం కేటిదొడ్డి మండలాధ్యక్షుడు టీచర్ గోవింద్ అన్నారు. మహర్షీ వాల్మీకి జయంతి



వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు టీచర్ గోవింద్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుందు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కారవంత మైన సమాజ నిర్మాణానికి రామాయణ మహాకావ్యం బాటలు వేస్తుందని, ఇంతటి మహొన్నత గ్రంథాన్ని అందిం చిన వాల్మీకిని ప్రతీఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు కొండన్న తయాప్ప, గద్వాల కర్రెన్న, వెంకటేష్ నాయుడు, ఆర్ వీరన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.




## "లవ్ రెడ్డి" ప్రేక్షకులు హార్ట్‌ఫుల్‌గా సపోర్ట్ చేస్తారు - కిరణ్ అబ్బవరం

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "లవ్ రెడ్డి". అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో హీరోయిన్లు గా నటిస్తున్నారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా "లవ్ రెడ్డి" సినిమా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు హీరో కిరణ్ అబ్బవరం అతిథిగా "లవ్ రెడ్డి" సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ - నేనూ, అంజన్ షార్ట్ ఫిలింస్ నుంచి వచ్చాం. ఆ ఎమోషనల్ బాండింగ్ మా మధ్య ఉంది. చాలా మంది ఇక్కడ కష్టాలు పడలేక, ఆర్థిక ఇబ్బందులతో తిరిగి వెళ్లిపోయారు. అంజన్ గట్టిగా నిలబడి ఉన్నందుకు అతనికి థ్యాంక్స్ చెబుతున్నా. మూడేళ్లుగా అంజన్ ఫ్యామిలీ అంతా లవ్ రెడ్డి సినిమా కోసం కష్టపడుతున్నారు. శ్రావణి తెలుగింటి అమ్మాయిలా ఉంది. ఆమె మాట్లాడిన స్పీచ్ కైనా సినిమాకు వెళ్లండి. నా క సినిమా ఈనెల 31న రిలీజ్ అవుతోంది. లవ్ రెడ్డి 18న వస్తోంది. నా సినిమా రెండు రోజులు ఆగి చూసినా ఫర్వాలేదు. లవ్ రెడ్డి మాత్రం వెంటనే చూసేయండి. సినిమా మీద ఎంతో ప్రేమ ఉన్న ఇలాంటి టీమ్ సక్సెస్ కావాలి. లవ్ రెడ్డి సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తున్న మైత్రీ వారికి, ఆంధ్రలో రిలీజ్ చేస్తున్న వంశీకి, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్న హొంబలే సంస్థకు థ్యాంక్స్ చెబుతున్నాఅన్నారు.

## పుష్ప-2 ది రూల్ కౌంట్‌డౌన్ స్టార్ట్

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టి పుష్ప-2 దిరూల్ మీదే. ఈ సినిమాకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా భారతీయ సినీ పరిశ్రమ యావత్ ఎదురుచూస్తున్న సినిమా ఇది. అది మన తెలుగు సినిమా కావడం గర్వకారణం. ఇక 'పుష్ప-2' ది రూల్.. డిసెంబరు 6న ప్రారంభం కానున్న పుష్పరాజ్ రూల్‌కు కౌంట్‌స్టార్ అయ్యింది. మరో50 రోజుల్లో అంటే డిసెంబరు 6న పుష్ప-2 రూల్ బాక్సాఫీస్‌పై ప్రారంభం కానుంది.

ఈ సందర్భంగా మేకర్స్ ఐకాన్‌స్టార్ మాసివ్ లుక్‌తో పుష్పరాజ్‌గా రూల్ చేయడానికి సింహాసనం అధిష్టించిన ఓ పోస్టర్‌ను వదిలారు. అంతేకాదు డిసెంబరు 6న భారతీయ సినిమాలో ఆ రోజు ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుందని హింట్ ఇచ్చారు మేకర్స్ ప్రతి సీన్‌కు గూజ్‌బంప్స్‌తో పాటు పుష్ప ది రూల్‌కు అందరూ ఫిదా అయిపోవాల్సిందే అంటున్నారు. మీరు ఎంత ఊహించుకుంటే అంతకు మించి.. అస్సలు తగ్గేదెలే లా చిత్రం వుండబోతుందనే విశ్వాసంతో వున్నారు చిత్ర మేకర్స్. అల్లు అర్జున్ 'పుష్ప-2'లో మైస్మరైజింగ్ నటన కోసం దర్శకుడు సుకుమార్ టేకింగ్..మేకింగ్.. కోసం అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు.



మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల పతాకంపై ప్రముఖ నిర్మాతలు, నవీన్ ఏర్నేని, వై రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన రెండు సాంగ్స్, టీజర్‌కు ఎంతటి అనూహ్యమైన స్పందన వచ్చిందో తెలిసిందే. దేవి శ్రీప్రసాద్ అందించిన ట్రెండీ పాటలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో వున్న ఈ చిత్రం, మరోవైపు నిర్మాణానంతర పనులను కూడా శరవేగంగా జరుపుకుంటోంది. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌హాఫ్ పర్‌ఫెక్ట్ లాక్ అయిన సంగతి తెలిసిందే. కంటెంట్ పరంగానే కాకుండా మేకర్స్ టెక్నికల్‌గా కూడా చాలా శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. ఇక డిసెంబరు 6న అందరూ పుష్ప ది రూల్ దే అని ఎదురు చూస్తున్నారు.

## 25న సముద్రుడు

కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరో హీరోయిన్లుగా నగేష్ నారదాసి దర్శకత్వంలో బధావత్ కిషన్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ సముద్రుడు అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. హీరో సుమన్ ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో నటించారు. సుమన్ యాక్షన్ సీక్వెన్సెస్ మరియు సినిమాలో ఉండే కామెడీ కథానుగుణంగా ప్రేక్షకులను అలరిస్తాయి. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ లో చిత్ర యూనిట్ ట్రైలర్ విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో తలకోన ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్, డైరెక్టర్స్ సముద్ర, ప్రముఖ నిర్మాతలు రామ సత్యన్నారాయణ, ముత్యాల రాందాస్, పీపుల్ మీడియా ఎగిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాసుల శ్రీధర్, చిత్ర కో ప్రొడ్యూసర్స్ జ్ఞానేశ్వర్, సాములు, చిత్ర నిర్మాత కీర్తన తదితరులు పాల్గొన్నారు."మత్యకారుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన చిత్రమిది. సముద్రమే వారి జీవనాధారం, అలాంటి సముద్రంలోకి వారు వెళ్లకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించే పరిస్థితుల్లో వారి జీవన పోరాటం, వారి మనో వేదనే ఈ చిత్రం. ఈ చిత్రంలో పెద్ద ఆర్టిస్టులు అందరూ నటించారు. ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



## 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ఫస్ట్ లుక్

30 రోజుల్లో ప్రేమించడం ఎలా సినిమాతో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన పాపులర్ యాంకర్- టర్న్- హీరో ప్రదీప్ మాచిరాజు తన రెండవ సినిమాతో అలరించబోతున్నారు. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ దుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపికా పిల్లి ప్రదీప్ సరసన హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మాంక్స్ %ఆ% మంకీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ మూవీ టైటిల్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అని అనౌన్స్ చేశారు. కోఇన్సిడెంట్లీ ఇది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మొదటి సినిమా టైటిల్ కావడం విశేషం. టైటిల్ అనౌన్స్ తో పాటు, ఫస్ట్ లుక్, మోషన్ వీడియోను రిలీజ్ చేశారు. గ్రీన్ బ్యాక్ డ్రాప్ లో ప్రదీప్, దీపిక కళ్లలోకి చూస్తూ కనిపించిన ఫస్ట్ లుక్ వారి డాజ్లింగ్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తోంది. మోషన్ వీడియోలో విలేజ్ లో గందరగోళ పరిస్థితి మధ్య ప్రదీప్ ఇంటి నుంచి దీపిక ఇంటికి ఫైర్‌పై ప్రయాణించే బ్యూటీఫుల్ సీన్ ని ప్రజెంట్ చేస్తోంది, ఇదొక ప్లజంట్ లవ్ స్టొరీని సూచిస్తుంది. ప్లాట్‌లైన్‌కి వస్తే- ఒక సివిల్ ఇంజనీర్ వర్క్ కోసం ఒక గ్రామంలోకి వస్తారు, అక్కడ అమ్మాయితో ప్రేమలో పడతాడు. ఇద్దరి మధ్య ఎంటర్ టైనింగ్ ప్రేమకథ, లాఫ్ లౌడ్ మూమెంట్స్, ఊహించని మలుపులు, సర్ ప్రైజింగ్ ప్రేమ కథగా వుండబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ హాస్యనటులు వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## 'డెకాయిట్'లో శృతి అవుట్

యువ కథానాయకుడు అడివి శేష్ నటిస్తున్న మూవీల్లో ఒకటి డెకాయిట్. ఆయన హీరోగా ఇప్పటికే వచ్చిన క్షణం, గూఢచారి వంటి చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించిన షానీల్ డియో.. డెకాయిట్ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలుగు, హిందీలో ద్విభాషా చిత్రంగా సుప్రియ యార్లగడ్డ రూపొందిస్తున్నారు. గత ఏడాది చివర్లో మూవీ టైటిల్ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. డెకాయిట్ టైటిల్ టీజర్.. సినీ ప్రియుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. జూలియెట్ ఎన్నేళ్లయింది మనం కలిసి అనే డైలాగ్? తో అడివి శేష్ ఎంట్రీ ఇచ్చారు. అల్లర్లు జరిగిన ప్రాంతంలో గన్ పట్టుకొని శ్రుతి కనిపించారు.
ఆ తర్వాత శేష్, శ్రుతి ఇద్దరూ ఒకరికొకరు తుపాకులు ఎక్కు పెట్టుకుంటారు. తుపాకీ ఫైర్ చేసినట్టు, కింద పడినట్టు బ్యాక్ గ్రౌండ్ సౌండ్ వచ్చింది. ఇద్దరు మాజీ లవర్స్ తప్పని పరిస్థితుల్లో కలిసి దోపిడీలు చేయడమే డెకాయిట్ మూవీ ప్రధాన బ్యాక్? డ్రాప్ గా క్లారిటీ వచ్చింది. మెలోడీ మొత్తంగా ఇంటెన్స్, లవ్ యాక్షన్ చిత్రంగా డెకాయిట్ తెరకెక్కిస్తున్నట్లు క్లియర్ గా అర్థమవుతుంది. ఇప్పటికే సగానికిపైగా షూటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే రీసెంట్ గా సినిమా నుంచి హీరోయిన్ శ్రుతి హాసన్ తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. డేట్స్ ఇష్యూ కారణంగా ఆమె.. ఆ నిర్ణయం తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే శ్రుతి.. మేకర్స్ కు కొన్ని రోజుల డేట్స్ ఇచ్చారట. కానీ డైరెక్టర్ షానీల్ డియో.. మెడికల్ ఎమర్జెన్సీ వల్ల అమెరికా వెళ్లారట.
దీంతో డేట్స్ అడ్జస్ట్ చేసుకోలేక శ్రుతి హాసన్.. డెకాయిట్ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది.
ఇప్పుడు మరో స్టార్ హీరోయిన్‌ను డెకాయిట్ మేకర్స్ సంప్రదించగా.. ఆమె ఓకే చెప్పారట. త్వరలోనే సెట్స్ లో అడుగుపెడతానని తెలిపినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో మేకర్స్.. కొత్త హీరోయిన్ పేరు అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.



## "వెట్టయన్ ది హంటర్"కి ప్రీక్వెల్ చేయాలని ఉంది : టి.జె. జ్ఞానవేల్



**దసరా సందర్భంగా విడుదలైన సూపర్ స్టార్ రజనీకాంత్ యాక్షన్ థ్రిల్లర్ 'వెట్టయన్ ది హంటర్' చిత్రం బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన వేట్టయ్యన్ ది హంటర్ అందరినీ ఆకట్టుకుంటోంది. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా నటించిన ఈ చిత్రం థియేటర్లలో దుమ్ములేపేస్తోంది తెలిపారు.**

**జైలర్ వంటి బ్లాక్ బస్టర్ తరువాత రజినీకాంత్ తో ఇలాంటి ప్రాజెక్ట్ ఎలా అనుకున్నారు?**

రజనీకాంత్ అభిమానులను అలరించే అంశాలతో పాటు ఆకట్టుకునే కంటెంట్‌తో సినిమాను రూపొందించడమే నా మెయిన్ టార్గెట్. ఈ చిత్రంలో అనేక అంశాలపై లోతుగా చర్చించినప్పటికీ.. ఆయన అభిమానులు ఇష్టపడే ఆ ఐకానిక్ మూమెంట్స్‌ను పెట్టాను. ఈ కథకి రజినీ స్టైల్, మ్యానరిజంను జోడించడమే నాకు ఎదురైన సవాల్.

**జర్నలిస్టుగా మీకున్న అనుభవం ఈ సినిమాకు ఎలా ఉపయోగపడింది? రజనీకాంత్‌ను ఏమైనా సలహాలు, సూచనలు అందించారా?**

రజినీకాంత్‌ను ఎలా చూడాలని, ఎలా చూపిస్తే అభిమానులు సంతోషిస్తారనే అవగాహన నాకు ఉంది. నేను ఆయనకు ఓ ఎలివేషన్ సీన్స్ చెబితే ఆయన ఫుల్ ఎగ్జైట్ అయ్యేవారు. అభిమానులు తన నుంచి ఏం కోరుకుంటారో ఆయనకు బాగా తెలుసు. ఆయన నాపై పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నారు. నేను ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను.

**'వెట్టయన్'లో రజినీకాంత్, అమితాబ్ బచ్చన్‌లను ఎలా బ్యాలెన్స్ చేశారు?**

సూపర్‌స్టార్‌లను బ్యాలెన్స్ చేయడానికి ప్రయత్నించడం కంటే.. నేను వారి పాత్రల భావజాలాన్ని బ్యాలెన్స్ చేయడంపై దృష్టి పెట్టాను. అమితాబ్ బచ్చన్ పాత్రను మొదట పరిచయం చేశాను. ఆ పాత్ర తాలుకా వ్యక్తిత్వాన్ని చూపెట్టాను. అయితే రజనీకాంత్ పాత్ర మరింత తటస్థ వైఖరితో ప్రారంభం అవుతుంది. వారిద్దరి మధ్య ఉండే భావజాలాల ఘర్షణ ద్వితీయార్థంలో ఆసక్తికరమైన కథనంగా మారింది.

**సినిమా కథ ఎన్‌కౌంటర్లు, న్యాయ వ్యవస్థ చుట్టూ తిరిగింది. వీటిని పరిశోధించడానికి మిమ్మల్ని ప్రేరేపించింది ఏంటి?**

దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల గురించి అనేక వార్తలు చదివాను. వాటితో ప్రభావితుడ్ని అయ్యాను. ఈ ఎన్‌కౌంటర్లలో ఎంత వాస్తవం ఉంది? అసలు ఇలా చేయడం కరెక్టేనా? దోషుల్నే శిక్షిస్తున్నామా? అనే వాటిని చూపించాను. ఎర్రచందనం స్మగ్లర్లు అంటూ చెట్లు నరికేసే అమాయకుల్ని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన నన్ను కదిలించింది. నా పరిశోధనలో పేదలు తరచూ ఇటువంటి ఎన్‌కౌంటర్ల బాధితులవుతున్నారని, సంపన్నులు న్యాయం నుండి తప్పించుకుంటారని తెలిసింది. విద్యా వ్యవస్థ లోపాలను కూడా ఈ చిత్రం స్పృశిస్తుంది.

**అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ ప్రాజెక్ట్‌కి ఆయన్ని ఎవరు? ఎందుకు ఎంపిక చేశారు?**

అనిరుధ్‌కు ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ తెలిసింది. ఆడియెన్స్ పల్స్ పట్టుకోవడంలో అతను నిష్ణాతుడు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన సంగీతాన్ని అందించడంలో దూసుకుపోతున్నారు. అతను సినిమా సోల్‌ను పూర్తిగా అర్థం చేసుకుంటారు. దానికి తగ్గ సంగీతాన్ని అందిస్తారు.

**ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వచ్చిన మలయాళ చిత్రం 'జన గణ మన'తో పోల్చడం గురించి మీ అభిప్రాయం ఏంటి?**

నేను 'జన గణ మన' చూశాను. కానీ నా ఉద్దేశ్యం ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌ల జీవితాలను వేరే కోణం నుండి చూపించడం. నేను వారి వృత్తి సంక్లిష్టతలను, పరిణామాలను అన్వేషించాలనుకున్నాను.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733